క్లుప్తంగా

'గిరిజన బంధు' పథకం అమలేదీ?


మాట్లాడుతున్న కామేష్


సుజాతనగర్: మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రకటించిన గిరిజన బంధు పథకాన్ని ఆలస్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కోయగూడెం పరిధి ఉప్పరిగూడెంలో ఆదివారం పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా కామేష్ మాట్లాడుతూ ఉప ఎన్నికలు జరిగిన ప్రతీ సందర్భంలో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం, ఆతర్వాత విస్మరించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ధిక్కార స్వరస్వరాన్ని వినిపించిన కవులు, కళాకారులు, రచయితలపై నిర్బంధం కొనసాగుతుండడం గర్హనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం మల్లికార్జున రావు, పాయం శారద, భూక్యా అచ్చమ్మ, బానోత్ కుమారి, వనిత, అశోక్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం..


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య


టేకులపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో కొద్దిరోజుల్లో ఏ పార్టీలో చేరుతామో ఆ పార్టీ తరపున వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పొంగులేటి, కనకయ్య క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. 36 గ్రామ పంచాయతీల్లో ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు నిర్వహించే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఎవరూ అధైర్య పడొద్దని పొంగులేటి అండగా ఉంటారని, కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ఆశించిన మేరకు విజయం సాధిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో పూనెం సురేందర్, ఉండేటి ప్రసాద్, బాణోతు భద్రు, భట్టు విజయ్, బోడ మంగీలాల్, మోకాళ్ల పోశాలు, ధర్మయ్య గౌడ్, అఫ్రోజ్, ఈది గణేష్, మధురెడ్డి, సమ్మయ్య, సంజయ్, హేమ్లా, పూన్యా తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో మండల పరిషత్ కార్యాలయం


చీకట్లో ఎంపీడీఓ కార్యాలయం

పాల్వంచరూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాన్ని విద్యుత్ దీపాల వెలుగులు విరజిమ్ముతుంటే పాల్వంచలోని ఎంపీడీఓ కార్యాలయం మాత్రం మూడు రోజులుగా అంధకారంలో మగ్గుతోంది. రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది కూడా విధులకు రాకపోవడంతో కనీసం ఒక్క లైటు కూడా వెలగడం లేదు. దీంతో ఆదివారం ఎంపీడీఓ కార్యాలయం చిమ్మ చీకట్లోనే ఉంది. దీంతో మండల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ములుగు జెడ్పీ చైర్మన్ మృతికి సంతాపం


జగదీష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ములుగు జిల్లా జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ గుండెపోటుతో మృతి చెందగా ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నివాళులర్పించారు. ఆదివారం తెల్లవారుజామున ఆయన వరంగల్‌లో మృతి చెందగా, స్వస్థలమైన మల్లంపల్లికి మృతదేహాన్ని తరలించారు. అక్కడ నివాళులర్పించడంతో పాటు ఆయన కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

- రోజంతా పలుమార్లు ట్రిప్
- మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


సుజాతనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్

సుజాతనగర్: అప్రకటిత విద్యుత్ కోతలు సామాన్యుడి మొదలు వ్యాపారుల వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 45 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరువవుతున్న భానుడి ప్రతాపం ఒక వైపు.. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మరోవైపు మండల ప్రజలను పెనంపై నుంచి పొయ్యిలో పడేస్తోంది. మండల కేంద్రం సుజాతనగర్‌తో పాటు దాదాపు అన్ని గ్రామాలు విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యుత్ సరఫరా అస్యవ్యస్తంగా మారడంతో చిన్నారులు, వృద్ధులు, పేషంట్లు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎంతసేపు ఉంటుంతో తెలియని పరిస్థితి నెలకొంది. 24 గంటలూ విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది.

పెరిగిన విద్యుత్ వినియోగం...

గతంతో పోలిస్తే ప్రజలు వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగిస్తుండడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఏసీలు, కూలర్ల వినియోగం దాదాపు వంద శాతానికి పైగా పెరిగిందనే చెప్పాలి. మండలంలో 15 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో 10 వేలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా కోతలు...

మండల కేంద్రం సుజాతనగర్‌తో పాటు, దాదాపు అన్ని గ్రామాల పరిధిలో విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సబ్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఉదయమంతా కూలి పనులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న ప్రజలు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడిగితే విద్యుత్ లైన్లలో సమస్య అని చెబుతున్నారే తప్ప, చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక విద్యుత్‌పై ఆధారపడి బతికే చిరువ్యాపారుల పరిస్థితి దారుణం. ఇంటర్నెట్, జీరాక్స్‌లు, పిండి మిల్లులు, కూల్‌డ్రింక్ షాపులు తదితర చిన్నతరహా వ్యాపారాలు చేసుకునే వాళ్లు నష్టాలు భరించలేక పూర్తిగా ఇళ్లకే పరిమితమవుతున్నారు.

సమాధానం చెప్పని అధికారులు..

ప్రజలు విద్యుత్ కోతలపై అధికారులకు ఫోన్ చేస్తే నిరాశే ఎదురవుతోంది. కరెంటు ఎప్పుడు వస్తోందో తెలుసుకుందామంటే ఏ ఒక్కరూ ఫోన్ ఎత్తరు. ఆఫీస్‌కు వెళితే ఫీల్డ్‌లో ఉన్నారనే సమాచారం ఇస్తారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అప్రకటిత కోతలు పెరిగాయి



ఇటీవల కాలంలో మండల కేంద్రంలో అప్రకటిత కోతలు బాగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి గాలులు, వర్షానికే కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నారు. వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– గూని శ్రీనివాసరావు, సుజాతనగర్

ఉక్కపోతతో ఇబ్బందులు



సమయపాలన లేకుండా విధిస్తున్న కరెంటు కోతలతో ఇబ్బంది పడుతున్నాం. అసలే ఎండాకాలం కావడంతో ఉక్కపోత, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రేయింబవళ్లు పలుమార్లు కరంటు వచ్చిపోతోంది. నిద్ర కూడా ఉండడం లేదు.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర

లోపాలు సరిచేస్తాం..



గాలిదుమ్ము, వర్షాల సమయంలో తీగలు తెగిపోవడంతో సరిచేస్తున్నాం ప్రస్తుతం ఆర్ అండ్‌బీ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీగల కింద ఉన్న చెట్లను తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది.

– జి.కిషన్, విద్యుత్ ఏఈ

పెన్షన్ పెంపుపై దివ్యాంగుల హర్షం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల రాజేందర్, దివ్యాంగులు

ఇల్లెందు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగులకు ప్రతినెలా రూ.4,116 పింఛన్ అందజేసే ప్రభుత్వం తెలంగాణలోనే ఉందని, అది గొప్ప మనసున్న దార్శనికుడు సీఎం కేసీఆర్ వల్లే సాధ్యం అయిందని ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్ అన్నారు.

ఆదివారం ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దివ్యాంగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాట్లాడుతూ.. తెలంగాణలో ఎన్నిక సందర్భంగా ప్రకటించని ఎన్నో పథకాలను ఎన్నికల తర్వాత అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను సమపాళ్లలో అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాంటి ఉదారత కలిగిన సీఎంను ఎన్నటికి మరువరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, ఎల్.కృష్ణ, జిల్లా నాయకులు యలమద్ది రవి, గిన్నారపు రాజేష్, బొమ్మెర వరప్రసాద్, చీమల సత్యనారాయణ, కాలే ప్రసాద్, దివ్యాంగులు ప్రవీణ్‌కుమార్, ఇసాక్, రాజేందర్, రాజ్‌కుమార్, ఈశ్వర్, రాజేశ్వరి, రాధా, కిషోర్, రవి తదితరులు ఉన్నారు.

ఉపరితల గనిలో డైరెక్టర్ల పర్యటన


కేఓసీని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్లు

టేకులపల్లి: సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి ఆదివారం కోయగూడెం ఉపరితల గనిలో పర్యటించారు. ఓసీ పని స్థలాలను సందర్శించి పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జీఎం ఎం.షాలేమురాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్యాలను అధికమించాలని, వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి మరియు రవాణాకు ఎటువంటి ఆటంకములు లేకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపరితల గనుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉద్యోగులకు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై అభ్యంతరం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి గణేష్ టెంపుల్ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు వివాదస్పదంగా మారాయి. రోడ్డు వెడల్పు చేసేందుకు మున్సిపల్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చి నెల రోజుల క్రితం పనులు మొదలుపెట్టారు. అయితే ఒకరు ఇంటిని కూల్చవద్దంటూ కోర్టుకు వెళ్లారు. దీంతో రోడ్డుకు మరోవైపు ఇళ్లను మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు ఒకవైపే కూల్చేవిధంగా అధికారులు ఏదో మతలబు చేస్తున్నారని వాపోతున్నారు. రెండువైపులా కూల్చాల్సిందేనని స్థానికులు కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒకవైపు మాత్రమే ఇళ్లను తొలగించడానికి కొంత మంది ప్రజాప్రతినిధులు కూడా పైరవీలు చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు.

కలెక్టర్‌ను కలిసిన వారిలో 21 వార్డు కౌన్సిలర్ మదా సత్యవతి, వై.శ్రీనివాసరెడ్డి, 40 మంది స్థానికులు ఉన్నారు. అయితే మున్సిపల్ అధికారులు తదుపరి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. నిర్ణయం ఏదైనా అందరికీ న్యాయం జరిగేలా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాగర్జన విజయవంతం

జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఆదివారం జరిగిన సీపీఐ ప్రజాగర్జన సభకు విజయవంతం అయింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలో డప్పు వాయిద్యాలతో కార్యకర్తలు ర్యాలీ వస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. సభా వేదికపై ఆటపాటలతో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాతీయ రాష్ట్ర నాయకులు తరలిరావడంతో సభా ప్రాంగణం కళకళలాడింది. – సింగరేణి(కొత్తగూడెం)


ర్యాలీగా వస్తున్న సీపీఐ కార్యకర్తలు


నృత్యం చేస్తున్న కళాకారులు


పాట పాడుతున్న మిమిక్రీ రమేష్

ఆలయానికి విరాళాలు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన వెంకటరమణ, శ్రీలక్ష్మి దంపతులు రూ.5,116 విరాళం, భద్రాచలానికి చెందిన మార్వలక్ష్మి రూ.5,016 అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

నేడు పోలీస్ 2 కే రన్

ఇల్లెందు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని గోవింద్ సెంటర్ నుంచి జగదాంబా సెంటర్ వరకు 2 కే రన్ నిర్వహిస్తున్నట్లు ఇల్లెందు సీఐ టి.కరుణాకర్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాలతో ప్రతీ నియోజకవర్గంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువతీ, యువకులు ఈ రన్‌లో పాల్గొనేందుకు ఉదయం 6 గంటలకే గోవింద్ సెంటర్‌కు చేరుకోవాలన్నారు.

భారతీయ బౌద్ధ మహాసభ అడ్‌హక్ కమిటీ ఎన్నిక

కొత్తగూడెంటౌన్: భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్ఐ) జిల్లా అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక రైటర్‌బస్తీలోని ప్రకృతి ఆశ్రమంలో ఆదివారం బౌద్ధ ఉపాసిక–ఉపాసకుల బౌద్ధ అభిమానులు మహాసభ నిర్వహించారు. బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరంధాములు, శీలం ప్రభాకర్ పాల్గొనగా జిల్లా అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. బీఎస్ఐ జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా కొచ్చర్ల కమలారాణి, కోకన్వీనర్లుగా మారపాక రమేష్, ధర్మారావు, పార్వతి, పుష్పలత, బడికె శాలిక్ తదితరులను నియమించినట్లు తెలిపారు. డాక్టర్ సత్తయ్య, సంజీవ్, బి.నవీన్‌కుమార్, చంద్రమౌళి, జే.బీ.శౌరి, తాండ్ర వెంకటేశ్వర్లు, కూసపాటి శ్రీను, సలిగంటి శ్రీను పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో వాహనాల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం షాలేమురాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో రెండు అంబులెన్స్ వాహనాల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు పర్చేజ్ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

బడి'బాట' పట్టిన 200 మంది విద్యార్థులు

ఇల్లెందు: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. అధికారులు ఇప్పటికే పాఠశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. జూన్ మొదటి వారం నుంచి ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో 200 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరారు. ఇక మండల పరిషత్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 78 పాఠశాలలు, ఐటీడీఏ స్కూల్స్ 18, హైస్కూల్స్ 15 వరకు మొత్తం 113 పాఠశాలలు ఉండగా మొత్తం ఎనిమిది వేల మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న రమేష్

జూలూరుపాడు: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యఅతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరవుతున్నట్లు చెప్పారు. శ్యామ్ రాథోడ్, నెల్లూరు కోటేశ్వరరావు, సున్నా రమేష్, మాదినేని సతీష్, ప్రసాద్, భూక్యా రాజేష్, భూక్యా రమేష్, గోపాల్‌రావు, పుల్లారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఈనెల 15న ఖమ్మంలో జరిగే బీజేపీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ బాలాజీ నాయక్, బీజేపీ టీచర్ సెల్ జిల్లా కన్వీనర్ వాంకుడోత్ హత్తీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం బొమ్మనపల్లి గ్రామంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ బహిరంగ సభకు కేంద్ర హోం శాఖామంత్రి అమిత్‌షా హాజరవుతారని తెలిపారు. టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లోని 46 బూత్ కమిటీలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, ఉపాధ్యక్షుడు రాములు నాయక్, సురేష్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు శంభు నాయక్, రాయల అన్వేష్ చౌదరి పాల్గొన్నారు.

బెటాలియన్ క్రీడామైదానం పరిశీలన


గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న సారంగపాణి

కొత్తగూడెంరూరల్: చాతకొండలోని 6వ బెటాలియన్ గ్రౌండ్‌ను ఆదివారం రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ కె.సారంగపాణితోపాటు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ అఫీషియల్స్ బృందం పరిశీలించారు. గ్రౌండ్‌లోని 400 మీటర్ల ట్రాక్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్ర, జాతీయ పోటీలకు అనువుగా తీర్చిదిద్దడానికి, అదేవిధంగా అథ్లెటిక్స్ ట్రెనింగ్ క్యాంప్ నిర్వహణకు బెటాలిన్ కమాండెంట్ శ్రీనివాసరావుకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కె.మహిందర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి రాజేందర్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ అఫీషియల్ వాసు, రజనీకాంత్, మధు పాల్గొన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ గవర్నర్ వరప్రసాద్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, సారంగపాణిని శాలువతో సత్కరించారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో నేడు 'చలో కలెక్టరేట్'


మాట్లాడుతున్న బిచ్చా

ఇల్లెందురూరల్: తెలంగాణ దశాబ్ది సంబురాలను నిరసిస్తూ చేపడతున్న దీక్ష దివస్‌లో భాగంగా 12వ తేదీన ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ డివిజన్ నాయకుడు, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా పిలుపునిచ్చారు. మండలంలోని కొమరారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలతో కాలం వెళ్లదీసిందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, రేషన్ కార్డులు, రుణమాఫీ, పోడుభూముల పట్టాలు, ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు, ఇంటింటికీ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు, దళితులకు మూడెకరాల వంటి అనేక హామీలను గాలికొదిలేసి, ఏదో సాధించినట్లు ప్రజాధనం వృథా చేస్తూ ఇప్పుడు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. సమావేశంలో బుర్ర రాఘవులు, శాంతారావు, కోరం ముత్తమ్మ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మహిళా రెజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొల్లాపురం గ్రామంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ మాట్లాడుతూ.. ఎంపీ బ్రిజ్‌భూషణ్ చర్యలను నిరసిస్తూ మహిళా రెజ్లర్లు చేసిన శాంతియుత ఆందోళనను అణచివేసే కుట్రకు పూనుకోవడం సిగ్గు చేటన్నారు. ఓ వైపు చర్చలు జరుపుతూ చర్యలు తీసుకుంటామని అంటూనే మరోవైపు కుట్రపూరితంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో రావూరి ఉపేందర్‌రావు, బొర్ర రమేష్, వెంకటేష్, మోకాళ్ల సుగుణ, భరత్, ప్రశాంత్, సతీష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90లో ఏడో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు నాటి జ్ఞాపకాలను పంచుకుని సందడిగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఎంతో క్రమశిక్షణతో ఎదిగి ఉన్నత స్థితికి చేరడం పట్ల నాటి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకటలక్ష్మి, గోవిందరాజు, వీటీఆర్ మోహన్‌రావు, నాటి విద్యార్థులు ఇంజ శ్రీనివాసరావు, తురక శ్రీనివాసరావు, వై.రాము, ఎండీ.సర్వర్ పాషా, బొమ్మకంటి శ్రీనివాస్, వాసుబోయిన గీత స్వామి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రామారావు, అనిల్, నసీమ బేగం, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం...



సింగభూపాలెం చెరువు వద్ద ఎడమ గేట్ వాల్వ్ నిర్మాణం ప్రమాదకరంగా మారింది. గతంలో నిర్మించిన ఈ గేట్‌వాల్వ్‌ను అప్పట్లో భూమికి సమాంతరంగా నిర్మించారు. సమీపంలోకి వచ్చేంత వరకూ ఇక్కడ గేట్ వాల్వ్ ఉందనే విషయం తెలియడం లేదు. సాయంత్రం వేళల్లో చాలామంది సేద తీరేందుకు ఇక్కడికి వచ్చి పోతుంటారు. ఏమాత్రం ఏమరుపాటున ఉన్నా, అందులో పడిపోయే ప్రమాదం ఉంది. గేట్ వాల్వ్‌కు రక్షణగా గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : శ్యాంబాబు, ఇరిగేషన్ ఏఈ
ఫోన్ నెంబర్: 7013210613